# మా అమ్మే అమ్మ

-భాగవతుల రామారావు

ఏ అమ్మా మా అమ్మలాంటి అమ్మ కాదు. 'అమ్మ' అంటే మా అమ్మే అమ్మ!

ఎవరి అమ్మ అమ్మ కాదు? అమ్మ అమ్మే. "మా అమ్మే అమ్మ" అని ఢంకా బజాయించి చెప్పడం అతిశయోక్తిలా అనిపించవచ్చు.

నిజమే. అందరి అమ్మలూ అమ్మలే, కాని అందరి అమ్మలూ మా అమ్మలాంటి అమ్మలు కారు, కాలేరు! అంతేకాదు, ఏ కొడుకూ నాలాంటి 'అమ్మకొడుకు' కాదు, కాలేడు! మా అమ్మా కొడుకుల్లాంటి అమ్మా కొడుకులు ఉండడం చాలా అరుదు.

ఇంతకీ మా అమ్మా కొడుకుల ప్రత్యేకత ఏమిటి?

నాకు తండ్రి లేడు. తండ్రి లేడంటే తండ్రి లేకుండా నేను పుట్టేనని కాదు. నేను పుట్టేసరికే మా అమ్మ విధవ. నాకు జన్మనిచ్చిన తండ్రి అప్పటికే చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతూ నేను పుట్టడానికి సరిగ్గా ముందురోజే కన్నుమూశారట. అంచేత నేను విధవకి పుట్టిన కొడుకుని.

నాకు బారసాల జరగలేదు. బారసాలనాడు మా నాన్న పెద్దకర్మ జరుగుతున్నది. బారసాలకి బదులు బాలింతరాలు అమ్మ విధవరాలు అయి ఎవరి కళ్లా పడకుండా ఓ మూల గదిలో కూచుని ఉంది. కనీ వినీ ఎరుగని సంఘటన ఇది.

బారసాలకి బదులుగా ఆనాటి- 75 ఏళ్ళ కిం దటి- బ్రాహ్మణ కుటుంబాల్ల ఆచారం ప్రకారం పసిబిడ్డకు చన్నుగుడిపిస్తున్న పచ్చిబాలింతరాలయిన అమ్మని పద్దెనిమిదేళ్లేనా నిండని వయసులో వితంతు విధానం పేరిట ఆమె పొడుగాటి జుత్తును గొరిగించి, బుర్రని గుండుచేసి, ఆమె నుదుటి కుంకుమ చెరిపేసి, చేతి గాజులు పగులగొట్టి, కట్టుకున్న రంగు చీరా-జాకెట్టూ విప్పించి, వాటిని బదులుగా అంచులేని తెల్ల సైనుతాను కట్టించి, దాని కొంగుతో ఆమె గుండు కప్పి, మెల్లో మంగళసూత్రంతో సహా ఒంటిమీది ఆభర ణాలన్నీ ఒలిచేసి, చూస్తే గగుర్పాటు కలిగించే వికృత రూపంలో లాంఛనంగా ఆమెను విధవను చేసేరు! ఆమె జీవితాంతం అదే రూపంలో ఉండాలి. పైగా, ఒంటిపూట - మధ్యాహ్నమే - భోజనం, రాత్రి ఫల హారం చెయ్యాలి. భోజనంలో ఉల్లి, వెల్లుల్లి, మసాలాలు నిషిద్ధం. విధవ దర్శనం అశుభం గనక ఆమె శుభ కార్యాలు, పూజానుష్ఠానాల్లో పాల్గొనకూడదు. బుర్రమీద జుత్తు మొలిస్తే ప్రతిమారూ మంగల్ని పిలిపించి గుండు గొరిగించుకుంటూనే ఉండాలి- చచ్చేదాకా!

అన్నదమ్ముని భార్య చనిపోయినా, కన్నతల్లే చనిపోయినా అన్నదమ్ముడు, కన్న తండ్రీ మళ్లీ పెళ్లి చేసుకోవచ్చు కాని మొగుడు చస్తే ఆడది- బాల వితంతువైనా- మళ్లీ పెళ్లి చేసుకోగూడదు. శాస్త్రాలూ, ధర్మాలూ వల్లించే బ్రాహ్మణ కొంపల్లో యుగాల తరబడి ఆచరించబడుతూ వస్తున్నది ఈ పైశాచిక అత్యాచారం. (ఇప్పుడు కొంచెం నయం. విధవలు శిరోముండనం చేయించుకోవడంలేదు. మంగళసూత్రం తీసేసి, బొట్టు పెట్టుకోవడంలేదు)

అనాదిగా ఆడదాని పట్ల ఇంత అధర్మం జరుగుతూనే ఉన్నా మన ధర్మశాస్త్రాలు మాత్రం "యత్ర నార్యస్తు పూజ్యంతే రమన్తే తత్ర దేవతాః। యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రా ఫలాః క్రియాః॥" (ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు విలసిల్లు తారు. ఎక్కడ స్త్రీలు అవమానానికి గురవుతారో అక్కడ జరిగే ప్రతి పనీ వ్యర్థం అయిపోతుంది) అని శుష్క ధర్మపన్నాలు చెబుతాయి.

బ్రాహ్మల కొంపల్లో ఆ రోజుల్లో అమ్మాయి ఈడేరగానే ఆమె చదువుకి స్వస్తి- పెద్దమనిషయిన ఖర్మకి! ఆడపిల్ల పెళ్లి కన్యగానే జరిపించాలన్నది ఆచా రం. 'కన్య' అంటే పదేళ్లు నిండని ఆడపిల్ల. ఈనాడూ పెళ్లిళ్లలో, మనం పట్టించుకోవడంలేదు కాని, పురోహి తులు అవే మంత్రాలు చదివి పెళ్లిళ్లు చేయిస్తున్నారు- కన్యాదానమప్పుడు. "అష్ట వర్షా భవత్కన్యా... ఇదానీం తవ దాస్యామి దత్తాం..." అన్న మంత్రార్థం ఏమిటి? "ఎనిమిదేళ్లు నిండిన ఈ పిల్లను ఇప్పుడు నీ చేతిలో పెడుతున్నాను" అని వరునితో వధువు తండ్రి అం టాడు!

మానవులకి మూలపురుషుడైన మనువు తను సంకలనం చేసిన మానవ ధర్మశాస్త్రం 'మనుస్మృతి'లో-

"పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే
రక్షంతి స్థావిరే పుత్రా నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి"

'బాల్యంలో తండ్రి, యౌవనంలో మొగుడు, ముసలి తనంలో కొడుకులు స్త్రీని రక్షిస్తారు. అంచేత స్త్రీ స్వతంత్రురాలుగ ఉండతగదు!' అని స్మృతిబద్ధం చేసి ఆడదాని అస్తిత్వానికి ఆనాడే సమాధి కట్టేడు.

ఇలాంటి పురుషాహంకార సమాజంలో ఆ రోజుల్లో పుట్టిన మా అమ్మకూడ ఈ సాంఘిక అత్యాచారాలకి అతీతురాలు కాదు- కాలేదు.

గుడ్డిలో మెల్ల, పన్నెండో ఏట వ్యక్తురాలైన మా అమ్మకి పదిహేనో ఏట పెళ్లయింది. పదిహేడో ఏట గర్భవతి అయి, పద్దెనిమిది నిండకుండా నన్ను కని, ముండమోసింది. ఈ రోజుల్లో అయితే ఆ వయసుకి ఆడపిల్లకి పెళ్లేకాదు.

ఇలా నన్ను ప్రసవించిందో లేదో, అలా మర్నాడే మొగుణ్ణి పోగొట్టుకున్న మా అమ్మ వైధవ్యం పేర నానా అత్యాచారాలకీ గురికాబడ్డాక ఏ నుయ్యో గొయ్యో చూసుకుని చావవలసింది. నన్ను కని ఉండకపోతే ఆ పనే చేసి ఉండేదట- నేను పెద్దయేక చెప్పింది మా అమ్మ. ఎన్ని అగచాట్లు భరించవలసి వచ్చినా బతుకు తీపివల్ల కాక, ఆమె చన్నుగుడుస్తున్న పది రోజుల పసికందు మీది పేగు బంధం - నా కోసం - అమ్మ బతక్క తప్పలేదు.

అమ్మ కడగండ్లు అంతటితో ఆగిపోలేదు. ఆమె అనుభవించవలసిన రంపపు కోత ఇంకా అప్పుడే ప్రారంభం అయింది. అమ్మకి బుర్ర గొరిగించి, తెల్ల తాను ముసుగు వేసి ఆమె రూపురేఖల్ని నానా బీభత్సం చేయడంతో అంత వరకూ ఆమె పాలు కుడిచి ప్రాణాలు నిలుపుకుంటున్న నేను, హఠాత్తుగా ఆమె రూపం మారిపోగానే, చూస్తే భయం వేస్తున్నట్టున్న ముసుగు మనిషిని చూసి జడుసుకుని పదిరోజుల పసివెధవను ఆమె చన్ను కుడవడం మానేసేనట! ఆమె దగ్గిరికే వెళ్లేవాడిని కానట. కన్నతల్లి రొమ్ము కుడవక ఆకల్తో బిడ్డ అలమటించి ఏడుస్తుంటే ఆ కన్నతల్లి మనస్సు ఎంత తల్లడిల్లిపోయిందో ఆ యాతన అనుభవించిన తల్లికే అర్థం అవుతుంది- చెప్పడానికి మాటలు చాలవు. బిక్కచచ్చిపోయిన నేను ఆమె దగ్గిరికే వెళ్లకపోతే అమ్మ పడ్డ బాధ ఇంతా అంతా కాదు.

మా అమ్మ అనుభవించిన ఈ హృదయ విదారక యమ యాతనని ఈ భూ ప్రపంచంలో ఏ అమ్మ అనుభవించింది?

అమ్మ దగ్గిర నేను పాలు తాగకపోతే ఆవుపాలు పోసి నన్ను బతికిద్దామంటే పోతపాలు తాగేవాణ్ణి కాదు. ఆకల్తో చావకుండా నన్ను బతికించడానికి మరో గత్యంతరం లేక అమ్మకంటె రెండు రోజుల ముందు ప్రసవించిన మా చాకలివాడి కొత్త కోడల్ని- ఆమె చాలా బలిస్టురాలు, చనుదోయి నిండా పాలున్న బాలింతరాలు- ఆమెను బతిమాలుకుని ఆమె బిడ్డతో పాటు నాకూ ఆమె చన్ను కుడిపించేవారట. ఆమె అమ్మ వయసుదే అయి, సుమంగళి రూపంలో ఉండ డం చేతో, ఆకలికి తట్టుకోలేకో, రొమ్ము పాలు కావ డంచేతో, ఆమె పాలు తాగేవాడినట.

అలా నా ప్రాణాలు నిలిపి, నానా ప్రయత్నాలూ చేసి, నన్ను క్రమంగా మచ్చిక చేసుకుని, పెంచింది

## దీపం

దీపం పరబ్రహ్మ స్వరూపం
వైదిక కర్మాచరణానికి ముఖ్యం!
దీపం చీకటిని చీల్చుకొని
జగతికి వెలుగును ప్రసరిస్తుంది!!
దేవాలయంలో వెలిగే దీపం
దైవ దర్శనానికి నిదర్శనం!
దీపం అజ్ఞానాన్ని పారద్రోలి
మనకు విజ్ఞానాన్ని ప్రసాదిస్తుంది!!
దీపం లేకపోతే అంతా అంధకారం
దాని పర్యవసానం ప్రమాదకరం!
దీపం వెలగని గృహం... అది
దుష్టశక్తులకు నిలయం!!
దీపాన్ని ఆరాధించటం
మన సనాతన సంప్రదాయం!
ఇంటికి దీపం ఇల్లాలు
కంటికి దీపం వెలుగులు!!
దీపాన్ని వెలిగిద్దాం
దోషాల్ని నిర్మూలిద్దాం!
శుభకార్యాలకు దీపతోరణాలు
సుఖ సంతోషాలకు సంకేతాలు...!!
దీపం విశ్వ శ్రేయస్సుకు శాంతి సందేశం
దాని ప్రజ్వలనం ధ్యానానికి దివ్యధామం!!

-తంగెళ్ల పాండురంగ శర్మ

అమ్మ.

చాకలిదాని పాలుతాగి బతికిన నేను నిజానికి చాకలివాణ్ణి కావాలి. కాని మా బ్రాహ్మలకు చాకల్ది శూద్రురాలు- ఆమె పాలు శూద్రపు పాలు కావు!

నాకు బారసాల జరక్కపోవడం చేత నామకరణమే జరగలేదు. మా తాతగారు (మాతామహుడు) పేరులేని నన్ను ఏదో పేరుతో పిలవాలి గనక "ఒరే తాతా!" అని పిలిచేవారు. అలా నా పేరే 'తాతయ్య' అయి పోయింది! అందరూ నన్ను 'తాతిగా!' అని పిలిచేవారు. మా అమ్మ మాత్రం నన్ను "నాయనా!" అని పిలిచేది.

నాకు ఒకటి రెండేళ్లు వయసొచ్చి క్రమంగా మనుషుల్ని- అమ్మనీ, తాతనీ, అమ్మమ్మనీ, మావయ్యనీ- పోల్చుకునే జ్ఞానం వచ్చేసరికి నాకు 'అమ్మ' అంటే తెల్లతాను పంచె కట్టుకుని, ఒంటిమీద జాకెట్టు లేకుండా, ఏ అలంకారాలూ, ఆభరణాలూ లేకుండా, బోడిగుండుతో వికృతాకారంలో విధవ రూపంలో ఉన్న ఆకృతే 'అమ్మ' అని తెలుసు కాని అందరి అమ్మల్లా జడవేసుకుని, నుదుట బొట్టు పెట్టుకుని, రంగుచీర కట్టుకుని, రవిక తొడుక్కుని, నగలు పెట్టుకుని- అంటే మా నాన్నతో కాపరం చేసేటప్పుడు అమ్మ ఎలా కనిపించేదో ఆ పునిస్త్రీ రూపం - నాకు తెలియదు. తర్వాత నా జీవితంలో ఎన్ని విజయాలు సాధించినా జీవితంలో నాకున్న ఈ ఒక్క లోటు భగవంతుడు కూడా తీర్చలేడు. ఈ విధంగా నాకు నాన్నే కాదు, పునిస్త్రీ రూపంలో 'అమ్మ' కూడ చనిపోయింది!

ఆ రోజుల్లో - 75 ఏళ్ల కిందట - బొబ్బిలి, పార్వతీ పురం, రాయగడ, జయపురం... మా నాన్న బతికున్న ప్పుడు ఉద్యోగం చేసిన ఈ ఊళ్లల్లో (అవి అప్పుడు విశాఖ జిల్లాలో ఉండేవి) ఎక్కడా ఫొటో స్టూడియోలు ఉండేవి కావు. అంచేత దంపతులుగా మా అమ్మా నాన్నల ఫొటోలేనా చూసే అదృష్టం నాకు కలగలేదు. 'తల్లి'దండ్రులు ఎలా ఉంటారో తెలియని నష్టజాతకులు లోకంలో ఎంతమంది ఉంటారు?

మా అమ్మలో చెప్పుకోతగ్గ గొప్పతనం ఏమిటంటే తనని చదువు సంధ్యలు లేకపోయినా నా చదువు గురించి అమ్మ పడ్డ ఆరాటం. బడిలేని తాతగారి పల్లె టూళ్లో పొలాల్లో డింగరాయి గొడ్డులా తిరిగే పల్లెటూరి బైతులా పెంచక నాకు ఐదేళ్లు వచ్చేసరికి కేవలం నా చదువు కోసం బొబ్బిలిలో ఇల్లు అద్దెకు తీసుకుని, నన్ను స్కూల్లో చేర్పించింది. పాతికేళ్లేనా నిండని వయసులో, మరో మగసాయం లేకుండా ఒక్కర్తే నా చదువు కోసం అమ్మ ఎన్ని పుర్రాకులు పడ్డదో ఆమెకే తెలుసు.

నేను నాలుగో క్లాసు చదువుతున్నప్పుడు మా అమ్మకు ఉన్న ఆ ఒక్క పెద్దదిక్కు- తాతగారు- చనిపోయేరు. ఆయన బతికున్నప్పుడే మా నిర్వాకం కోసం మా అమ్మ బంగారం అమ్మగా వచ్చిన డబ్బూ, మా నాన్నగారి ద్వారా సంక్రమించిన కొద్దిపాటి ఆస్తి ఊళ్లో నమ్మకస్తులయిన కొందరు భూస్వాముల వద్ద వడ్డీకి తిప్పమని దాచి ఉంచేరు. నా చదువుకి అవసరం పడ్డప్పుడు అమ్మ తాతగారి ఊరెళ్లి వాళ్లని అడిగి డబ్బు తెచ్చుకునేది. వాళ్లూ డబ్బు దగ్గిర అమ్మని ఎన్నడూ దగా చెయ్యలేదు.

ఒకమారు- అప్పుడు నేను ఫస్ట్‌ఫామ్ (ఆరో క్లాసు) చదువుతున్నాను, పదేళ్లవాడిని- మా తాతగారి ఊరు వెళ్లినప్పుడు జరిగిన సంఘటన నా జీవితకాలం మరిచిపోలేదు. 65 ఏళ్ల కిందట జరిగినా నేటికీ మరిచి పోలేని, అమ్మని అనునిత్యం జ్ఞాపకం చేసే సంఘటన అది.

ఎప్పుడు తాతగారి ఊరెళ్లినా పెరట్లో చింతల తోపు దగ్గరి కళ్లంలో కిర్రుగానుగు మీద ఆడుకోవడం నాకు సరదా.

ఈమారు కూడా నలుగురు కుర్రాళ్లం- అందరూ నా వయస్సువాళ్లే- కిర్రుగానుగు ఆడుకుంటునాం. గానుగు అడ్డుగడకి ఒక కొసని నేను, రెండోవేపు మరో కుర్రాడు కాళ్లు కిందికి వేలాడేసుకుని కూచున్నాం, పడిపోకుండా ఊతకొయ్యని పట్టుకుని. మిగతా ఇద్దరబ్బాయిలు గానుగుని - అడ్డుగడని- గుండ్రంగా తిప్పడం మొదలెట్టేరు. కిర్రుకిర్రుమంటూ గానుగు జోరుగా తిరుగుతుంటే కూచున్న ఇద్దరం సరదాతో కేరింతలు కొడుతున్నాం. హఠాత్తుగా- బహుశా

## అటూ - ఇటూ

మన రాజకీయ పార్టీలు
ప్రతిపక్షంలో ఉన్నప్పుడు
ప్రభుత్వాన్ని విమర్శిస్తాయి!
ప్రభుతాన్ని ఏర్పరచినప్పుడు
ప్రజలని విస్మరిస్తాయి!

–తాజీప్రసాద్

కుర్రాళ్లు గానుగుని మరీ జోరుగా తిప్పడం చేతో, అవతలి అబ్బాయి నాకంటె ఎక్కువ బరువు ఉన్నాడో, ఏమయిందో మరి, తిరుగుతున్న అడ్డుదూలం నిలువు రాటకి అమర్చిన కీల నుంచి ఊడి బయటికొచ్చేసింది. వెంటనే ఇద్దరం దబేలున కింద పడ్డాం. అవతలి అబ్బాయికి మోచేతుల దగ్గిరా, ముణుకుల వద్దా చర్మం కొంచెం చెక్కుకుపోయింది కాని పెద్ద దెబ్బలేమీ తగల్లేదు. నేను మాత్రం కింద పడ్డవాణ్ణి మరి లేవలేకపోయేను. మేం కూచున్న అడ్డుమాను- అది చాలా దృఢమైందీ, బలమైందీ- నేను కింద పడ్డప్పుడు మడతపడ్డ నా కుడికాలు పాదం మీద పడ్డాది. చీలమండ మీద పడ్డాదేమో పాదం కీలు లోపల బెణికిందో, చిట్లిందో నాకు తెలియదు. నేను మాత్రం పాదం కదపలేకపోయేను. చీలమండ దగ్గిర భరించ రాని నొప్పి. చూస్తుండగానే చీలమండ వాచిపోయింది.

నా ఏడుపు విని, ఇంట్లోంచి మా అమ్మ పరుగెత్తుకు వచ్చింది. నేలపడున్న నన్ను లేవనెత్తబోతే, నిలబడ్డం మాట దేవుడెరుగు, పాదం నేలమోపలేకపోయేను. ఒకటే నొప్పి. మా అమ్మ నన్ను అమాంతం రెండు చేతుల్లో ఎత్తుకుని ఇంట్లోకి మోసుకొచ్చింది.

బొబ్బిలి తీసుకెళ్లి డాక్టరుకి చూపించేదాకా తాత్కాలిక ఉపశమనానికి జేగురుమన్ను (ఎర్రమట్టి), పసుపు, సున్నం కలిపిన ముద్ద వేడిచేసి, మడమ చుట్టూ అద్ది, తమలపాకులతో కప్పి, గుడ్డతో గట్టిగా కట్టు కట్టింది.

బొబ్బిలి వెళ్లే పాసింజరు రైలు పట్టుకోవాలంటే అప్పటికి మరో మూడు గంటలే టైముంది. స్టేషన్‌కి వెళ్లాంటే ఆ రోజుల్లో ఎద్దులబండీ తప్ప మరో సదుపాయం లేదు. తాతగారి ఊర్నుంచి బస్సు ఆగేదాకా కూడా రోడ్డు లేదు గనక గోర్జీలోంచి నాటురస్తాలో చుట్టుదారిని ఎడ్లబండిలో వెళ్తే కోమటిపల్లి రైల్వే స్టేషన్ చేరడానికి ఆరుగంటలు పడుతుంది. పోనీ బస్సు రోడ్డు దాకా బండిలో వెళ్లి, అక్కడ బస్సు పట్టుకుని కోమటిపల్లి వెళ్దామంటే బస్సు కోమటిపల్లి వెళ్లదు. స్టేషన్‌కి మైలున్నర దూరంలో బస్సు దిగి, నాటురస్తాలో స్టేషన్‌కి నడిచివెళ్లాలి. అక్కడ బళ్లు దొరకవు. అంతకంటె అడ్డుదారంట నడిచి వెళిపోతే మూడు గంటల్లో స్టేషన్ చేరుకోవచ్చు. అందరూ, బరువు సామాన్లు లేనివాళ్లు, స్టేషన్‌కి నడిచే వెళ్తారు. సామాన్లు ఉంటే ఎడ్ల బండే గతి. మా అమ్మా నేనూ ఎప్పుడూ నడిచే వస్తాం, నడిచే వెళ్తాం.

అవేళ సమయానికి మామయ్య ఇంట్లో లేదు. పనిమీద గజపతినగరం వెళ్లేడు. మా అమ్మ ఆదరా బాదరాగా మా బట్టలు సంచీలో పర్ది, నన్ను తన చంకలో ఎత్తుకుని, ఓ చేత్తో సంచీ పట్టుకుని ఆలస్యం చెయ్యకుండా కోమటిపల్లి కాలినడకన బయల్దేరింది. కాళ్లకా చెప్పుల్లేవు. (ఆ రోజుల్లో పునిస్త్రీ ఆడవాళ్లే జోళ్లు తొడుక్కునేవారు కాదు. విధవలకి చెప్పుల ప్రసక్తే లేదు. మా అమ్మ చనిపోయేదాకా ఎన్నడూ చెప్పులు తొడుక్కోలేదు)

అడ్డుదారిన మా తాతగారి ఊరు నుంచి మైలున్నర పొలాల గట్లుమీంచి, మరో మైలున్నర రైలుకట్ట పక్క కాలిబాట మీంచి వెళ్లాలి. మా అమ్మ నన్ను ఎత్తుకునే

## ప్రయోజనం

బొగ్గులా
నిస్త్రాణంగా
నిరుపయోగంగా
చాలానాళ్లు
బ్రతకడం కన్నా
నిప్పులా ప్రకాశిస్తూ
శక్తిని ప్రగతికి
వినియోగిస్తూ
ప్రయోజనాన్ని సాధిస్తూ
కొన్నాళ్లు బ్రతికినా చాలు.

## భారం

తింటుంది తిరుగుతుంది
అదే పనిగా అరుస్తుంది.
అది తినేది ఎంగిలి తిండి
అది అరచేది అర్థం కానిది
దాని బ్రతుకులో ప్రగతి లేదు
అది పరులకెప్పుడు పనికిరాదు
తిని తిరిగేవాళ్లు
అదే పనిగా అరిచేవాళ్లు
కాకిలాగే పనిచేయలేరు
ప్రగతి సాధించలేరు
కానీ-
పనిచేసేవాళ్లకు భారమవుతారు.

-రేగులపాటి కిషన్‌రావు

సన్నపాటి పొలంగట్ల మీంచి జారిపడకుండా ఎలాగో కష్టపడి రైలుకట్ట చేరుకుంది. గేదిపెయ్యిలావున్న పదేళ్ల కుర్రాణ్ణి – నా బరువు కనీసం పాతిక కేజీలకి తక్కువుండదు– ఎత్తుకుని నడవడమంటే మాటలు కాదు. ఆడది... పైగా పాతిక్కేజీల బరువున్న నన్ను మోసుకుని ఇంత దూరం నడవడం అలవాటు లేదేమో, అలిసిపోయినప్పుడు నన్ను మెల్లగా దించి నేల కూచోబెట్టి, కాసేపు అలుపు తీర్చుకుని మళ్లీ నన్ను ఎత్తుకుని నడక ప్రారంభించేది. మా అమ్మ అవస్థ చూసి నేను బెంబేలెత్తిపోయేను.

ఈ బాధ చాలనట్టు రైల్వేస్టేషన్ కనుచూపు మేర– రెండు ఫర్లాంగుల దూరంలో– ఉందనగా భగవంతుడు మా అమ్మని ఊహించని కఠిన పరీక్షకి గురిచేసేడు. అక్కడికొచ్చేక ఓ చిన్న చిట్టిగెడ్డ దాటాలి. అక్కడిదాకా వచ్చేక అందరూ రైలు కోసం కట్టిన వంతెన మీంచి కాక రైలు కట్ట దిగి ఏట్లోంచి నడిచే అవతలి ఒడ్డు చేరుకున్నాక తిరిగి రైలుకట్ట పక్కనుంచి నడుస్తారు. ఏట్లో ఎప్పుడో ఏరొస్తే కాని సాధారణంగా నీరుండదు. ముందురోజు పడ్డ కుండపోత వర్షం వల్ల అవేళ ఏట్లో నీరు గట్లు కోసుకుంటూ పారుతోంది. అమ్మ హతాసు రాలయిపోయింది. రైలు బ్రిడ్జి మీంచి ఏరుదాటడం తప్ప మరో గత్యంతరం లేదు. బ్రిడ్జి మీంచి అమ్మ ఇంతకు ముందు ఎప్పుడూ నడిచి వెళ్లలేదు.

రైలు బ్రిడ్జి 100–120 అడుగుల కంటె అట్టే పొడవు లేదు. కాని, బ్రిడ్జి మీద నడిచి వెళ్లడానికి కాలిబాట సదుపాయం ఏమీ లేదు. రైలు పట్టాల కోసం వేసిన ఉడెన్ స్లీపర్ల మీద జాగ్రత్తగా అడుగులు వేస్తూ బ్రిడ్జి దాటాలి. వచ్చిన చిక్కల్లా స్లీపర్‌కీ స్లీపర్‌కీ మధ్య సుమారు రెండు జానల ఎడం ఉంటుంది. స్లీపర్ల మీంచి నడుస్తున్నప్పుడు ప్రతి అడుగూ సరిగ్గా స్లీపరు మీదే వేస్తూ నడవాలి. అడుగు తడబడినా, ఖాళీ జాగాలో అడుగు వేసినా, బేలన్సు తప్పి అటూ ఇటూ తూలిపోయినా అయిపోతుంది మా పని – కింద పారుతున్న ఏటి నీట్లో జలసమాధి కావలసిందే.

నన్ను ఎత్తుకుని, అడుగులు తడబడకుండా, బేలన్సు తప్పకుండా, ఏమరుపాటు లేకుండా స్లీపర్ల మీద అడుగులేసుకుంటూ నడవడం వీటి విద్యలవాడు తాడుమీద నడవడం కంటె అత్యంత ప్రమాదకరం. అనుభవిస్తే కాని అప్పుడు అమ్మ ఎదుర్కొన్న అవాం తరం అర్థంకాదు. అమ్మ అంతటి కష్టాన్ని అవేళ తట్టుకోలేకపోయినా, బ్రిడ్జిమీద ఒక్క తప్పడుగు వేసినా ఇవాళ ఈ కథ చెప్పడానికి నేనుండేవాడిని కాను.

అమ్మ తన శక్తినంతా కూడగట్టుకుని, వేస్తున్న ప్రతి అడుక్కి మృత్యువున తోసిరాజంటూ కఠోర దీక్షతో కఠిన పరీక్షని ఎదుర్కొని బ్రిడ్జి ఆవలిగట్టు చేరుకుం దంటే అది ఒక మిరైకిల్ – చమత్కారమే! ఒక అసంభవాన్ని సంభవం చేసింది. ఏ ఆడదీ చెయ్యలేని సాహసాన్ని– మూడు మైళ్ల దూరం పదేళ్ల కొడుకుని ఎత్తుకుని కాలినడకన మోసుకురావడమే గాక బ్రిడ్జిమీద 'వీటివిద్య' చేసి నిలదొక్కుకోవడం 'గిన్నిస్ బుక్'లో రికార్డు కాదగ్గ అద్భుత చర్య! అది సృష్టిలో ఒక్క 'అమ్మ'కే సాధ్యం. కన్నతల్లి 'కడుపుతీపి' అంటే ఏ శబ్దకోశం అక్షరబద్ధం చెయ్యలేని అర్థాన్ని ఆచరణలో చేసి చూపింది అమ్మ. అందుకే 'అమ్మ' అంటే మా అమ్మే అమ్మ.

ఆరోజు తలుచుకుంటే ఇప్పటికీ నా కళ్లు వర్షించే విషయం ఏమిటంటే– బ్రిడ్జి అవతలి గట్టు చేరుకోగానే నన్ను మెల్లిగా కిందికి దింపి, ఎగ ఊపిరితో ఆయాస పడుతూ కూడా "నాయనా! కాలు నొప్పెట్టడం లేదు కద?" అని నన్నడిగింది. 'అమ్మ' అంటే ఇదీ అమ్మ!...

మా అమ్మ జీవితాంతం కష్టాల్తోనే ఎదురీదింది. అమ్మ ఏం సుఖపడినా నా చదువు పూర్తయి, నేను ఉద్యోగంలో స్థిరపడి, పెళ్లిచేసుకున్నాక మనవలతో గడిపిన కొద్దిరోజుల తృప్తి మాత్రమే.

అమ్మ నిజానికి 'శాపగ్రస్త' అయివుండాలి. లేకపోతే జీవితంలో సుఖం అన్నది ఎరక్కుండా కష్టాలే పడి అలిసిపోయిన అమ్మని ఇక సుఖపెడదామనుకున్న నా ఆశ అడియాసే అయింది. భగవంతుడికి అమ్మ సుఖ పడ్డం కళ్లు కుట్టి ఉంటాయి– ఆమెను అత్యంత బాధా కరమైన కేన్సర్ వ్యాధికి గురిచేసేడు.

ఆరేళ్లు యమయాతన, శత్రువులక్కూడా అలాంటి బాధ కలక్కూడదు, అనుభవించి సరిగ్గా ఇవాళకి పాతి కేళ్ల కిందట అమ్మ కేన్సర్ నరకం నుంచి శాశ్వత ముక్తి పొందింది.

ఇవాళ– ఆమె రజత వర్ధంతి నాడు అమ్మని సంస్మ రించుకోవడంలో ఓ విశిష్టత ఉంది. ఇవాళ అమ్మ తద్దినం కదా? ఆబ్దికం పూర్తయి పెరట్లో ప్రహరీ గోడ మీద పెట్టిన పిండం పిడచ కాకులు తిండం పూర్తయిన మరునిమిషం పురిటికి పుట్టింటికి వెళ్లిన నా కోడలు ఆడపిల్లని ప్రసవించిందని ఫోన్ వచ్చింది.

మా అమ్మ మళ్లీ మా ఇంట్లో పుట్టింది!

■